సాక్షి పల్నాడు

గురువారం । 8 । జూన్ । 2023



డీఎస్‌ఓగా పద్మ

గుంటూరు వెస్ట్: జిల్లా పౌరసరఫరాల అధికారి (డీఎస్‌ఓ)గా కోమలి పద్మ బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 520.50 అడుగుల వద్ద ఉంది. సాగర్ నుంచి ఎస్‌ఎల్‌బీసీకి 900 క్యూసెక్కులు విడుదలవుతోంది.

నిమ్మకాయల ధరలు



తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో బుధవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.1,100, గరిష్ట ధర రూ.2,500, మోడల్ ధర రూ.1,600 వరకు పలికింది.

న్యూస్‌రీల్

జూలై నాటికి ఎంపీ ల్యాడ్స్ పనులు పూర్తిచేయాలి

ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, కలెక్టర్ శివశంకర్

నరసరావుపేట: ఎంపీ ల్యాడ్స్ నిధుల (2019–23)తో మంజూరైన పనులను జూలై నాటికి పూర్తిచేయాలని అధికారులను ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లో ఎంపీ ల్యాడ్స్ నిధుల వినియోగంపై సమీక్ష నిర్వహించారు. ఎంపీ, కలెక్టర్ మాట్లాడుతూ ఐదేళ్ల కాలానికి రూ.12.44 కోట్లతో 141 పనులు మంజూరు చేశామని వీటిలో రూ.5.40 కోట్లతో చేపట్టిన 98 పనులు పూర్తి కావడం, లేదా చివరి దశకు చేరుకోవడం జరిగినట్టు వివరించారు. మిగిలిన పనులను జూలై నాటికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ కేఆర్ కల్పశ్రీ, డీఆర్వో కె.వినాయకం, సీపీఓ ముక్తేశ్వరరావు, పీఆర్ ఈఈ సుబ్బారాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ సురేశ్, ఏపీసీపీడీసీఎల్ డీఈ వై.ఏడుకొండలు, ఏపీఎంఎస్‌ఐడీసీ ఈఈ శ్రీధర్, దాచేపల్లి, గురజాల మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

11న జిల్లా పవర్ లిఫ్టింగ్ ఎంపిక పోటీలు

మంగళగిరి: నగరంలోని ఫిట్‌జోన్ ఆవరణలో ఈనెల 11న ఆదివారం ఉదయం 10 గంటలకు జిల్లా మెన్, ఉమెన్ పవర్ లిఫ్టింగ్, బెంచ్ ప్రెస్ సీనియర్ టీమ్ సెలక్షన్స్ నిర్వహించనున్నట్టు కోచ్ ఎస్‌కే సంధానీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రతినిధులు సకల కోటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగే ఈ సెలక్షన్స్‌లో అర్హత సాధించిన క్రీడాకారులను ఈనెల 24, 25 తేదీల్లో నెల్లూరు పట్టణంలో జరిగే ఆంధ్రప్రదేశ్ సీనియర్ స్టేట్ ఎక్విప్డ్ మెన్, ఉమెన్ పవర్ లిఫ్టింగ్, బెంచ్ ప్రెస్ పోటీలకు జిల్లా జట్టు తరఫున పంపనున్నట్టు తెలిపారు.

12న మెగా అప్రెంటిస్ మేళా

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు కలెక్టరేట్ వద్ద ఉన్న జిల్లాస్థాయి పారిశ్రామిక శిక్షణ సంస్థలో ఈనెల 12న ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటిస్ మేళా నిర్వహిస్తున్నట్లు సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ సాయి వరప్రసాద్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తికల ఐటీఐ పూర్తి చేసిన అభ్యర్థులు విద్యార్హతల సరిఫికెట్ల జిరాక్స్ కాపీలు, ఆధార్‌కార్డు, పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో ఈనెల 12న ఉదయం 10 గంటలకు హాజరు కావాలని సూచించారు. వివరాలకు 0863–2234720, 7386885639 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పసుపు క్వింటాలు రూ.6,850కి కొంటాం

జేసీ శ్యామ్‌ప్రసాద్

నరసరావుపేట: ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏపీ మార్క్‌ఫెడ్ పర్యవేక్షణలో రైతు భరోసా కేంద్రాలలోని కొనుగోలు కేంద్రాల ద్వారా పసుపు క్వింటాలును రూ.6,850కు బుధవారం నుంచి కొనుగోలు చేయనున్నట్టు జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు కలెక్టర్ ఎల్.శివశంకర్ అధ్యక్షతన ఏర్పాటైన జిల్లా కొనుగోలు కమిటీ నిర్ణయించిందని పేర్కొన్నారు. ఇతర వివరాలకు సమీపంలోని ఆర్‌బీకేలలో సంప్రదించాలని రైతులకు సూచించారు.

జర్మనీలో నర్సింగ్ ఉద్యోగాలు

నరసరావుపేట ఈస్ట్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, టాక్ట్ ఇంటర్నేషనల్, ఏసీఎస్ ఆర్టీసీ సంయుక్త ఆధ్వర్యంలో బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసిన అభ్యర్థులకు జర్మనీలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సంజీవరావు బుధవారం తెలిపారు. నర్సింగ్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి, రెండు సంవత్సరాల అనుభవంతో పాటు వయస్సు 35 సంవత్సరాల్లోపు ఉండాలని పేర్కొన్నారు. పాస్‌పోర్ట్ వినియోగంలో ఉండాలన్నారు. జర్మనీలో పనిచేసేందుకు సిద్ధపడిన వారంతా విజయవాడ కేఎల్ విశ్వవిద్యాలయంలో జూలై ఒకటో తేది నుంచి అందించే బీ1 స్థాయి జర్మన్ భాష ఉచిత ఆన్‌లైన్ శిక్షణ తరగతులకు హాజరుకావాలని ఆయన సూచించారు. దాదాపు రెండు నెలల పాటు రోజుకు ఆరు గంటల పాటు శిక్షణ ఉంటుందని వివరించారు. అభ్యర్థులకు విమాన చార్జీలతో పాటు జర్మనీలో మొదటి ఆరు నెలలు ఉచిత భోజన, వసతి సౌకర్యాలు కల్పిస్తారని పేర్కొన్నారు. వివరాలకు సంస్థ హెల్ప్‌లైన్ నంబర్ 9988853335లో సంప్రదించాలని తెలిపారు.

వృద్ధాశ్రమాలకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

నెహ్రూనగర్(గుంటూరు): జిల్లాలో వృద్ధుల ఆశ్రమం నడుపుతున్న నిర్వాహకులు తప్పనిసరిగా విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వృద్ధుల సంక్షేమ శాఖ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఆ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సీహెచ్ సువార్త బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇతర వివరాలకు 9959127045లో సంప్రదించాలని సూచించారు.

సేతులెత్తి మొక్కేలా..

ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల ప్రజల శతాబ్దాల కల నెరవేరబోతుంది. ఈ రెండు జిల్లాలను కలుపుతూ పల్నాడు జిల్లా మాదిపాడు నుంచి ఎన్టీఆర్ జిల్లా ముక్త్యాల వరకు కృష్ణా నదిపై 600 మీటర్ల పొడవు, 12 మీటర్ల వెడల్పున వంతెన నిర్మాణానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 12న శంకుస్థాపన చేయనున్నారు. వారధి నిర్మితమైతే పల్నాడు పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుంది. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

– సాక్షి, నరసరావుపేట, అచ్చంపేట:



పల్నాడు జిల్లా మాదిపాడు వద్ద ఎన్టీఆర్ జిల్లా ముక్త్యాలవరకు కృష్ణానదిపై నిర్మించబోయే వంతెన ప్రాంతం

- అభివృద్ధికి 'వారధి'
- కృష్ణానదిపై మాదిపాడు వద్ద రూ.60 కోట్లతో వంతెన నిర్మాణం
- 12న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దివ్య హస్తాల మీదుగా శంకుస్థాపన
- పల్నాడు, ఎన్టీఆర్ జిల్లాల మధ్య రాకపోకలకు అనుకూలం

చారిత్రక ప్రాశస్త్యం

18వ శతాబ్దంలో రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు అచ్చంపేట మండలం చింతపల్లిని కేంద్రంగా చేసుకుని ఈ ప్రాంతాన్ని పాలించాడు. నాటి నుంచి కృష్ణానదిపై వంతెన నిర్మించాలన్న ప్రతిపాదనలు ఉన్నాయి. కానీ ఆచరణ సాధ్యం కాలేదు. ఏనాటికైనా రెండు జిల్లాలను కలుపుతూ కృష్ణానదిపై వంతెన నిర్మాణం జరుగుతుందన్న ఆలోచనతోనే నదికి రెండు వైపులా రాజావెంకటాద్రి నాయుడు తన తల్లిదండ్రులైన జగ్గన్నభూపాలుడు, అచ్చమాంబల పేర్లతో గ్రామాలను నిర్మించారు. అలా నిర్మితమైన గ్రామాలే కృష్ణానదికి అవల ఉన్న జగ్గయ్యపేట, ఇవతల ఉన్న అచ్చంపేట అని చరిత్రకారులు చెబుతున్నారు. ఇన్నాళ్లకు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు చొరవ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషితో వారధి ఆకాంక్ష నెరవేరబోతుంది.

వ్యాపార లావాదేవీలకు మేలు

వంతెన నిర్మాణం పూర్తయితే రెండు జిల్లాల మధ్య రాకపోకలు, వ్యాపార లావాదేవీలు సులభతరమవుతాయి. ప్రస్తుతం జగ్గయ్యపేటలోని సిమెంట్ ఫ్యాక్టరీల నుంచి పల్నాడుకు సరుకు దిగుమతి కావాలంటే విజయవాడ, గుంటూరు మీదుగా 100 కిలోమీటర్లకుపైగా దూరం ప్రయాణించాల్సి వస్తోంది. వారధి పూర్తయితే కేవలం 40 కిలోమీటర్లలోపు దూరం మాత్రమే ఉంటుంది. మరోవైపు ఫ్యాక్టరీల నుంచి చెన్నైకి సిమెంట్ రవాణాకు దూరం తగ్గుతుంది. టోల్ భారమూ ఉండదు. మాదిపాడు, దాని పరిధిలోని గిరిజన తండాల నుంచి ఏ చిన్న అవసరం వచ్చినా ప్రస్తుతం అచ్చంపేటకు 30 కిలోమీటర్లకుపైగా ప్రయాణించాల్సి వస్తోంది. వంతెన నిర్మాణంతో జగ్గయ్యపేట కేవలం 12 కిలోమీటర్ల దూరంలోనే ఉంటుంది. ఈ ప్రాంతం నుంచి హైదరాబాద్ వెళ్లాలన్నా 70 కిలోమీటర్ల దూరం తగ్గుతుంది.

పడవ ప్రమాదాలకు చెక్


ప్రస్తుతం రెండు జిల్లాల ప్రయాణికులు నది దాటేందుకు మర పడవలను ఆశ్రయిస్తున్నారు. దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. రాత్రి సమయాల్లో అత్యవసరమైతే స్థానికులు చేపల పడవల్లోనూ రాకపోకలు సాగిస్తున్నారు. దీనివల్ల నిత్యం ప్రమాదం పొంచి ఉంటుంది. వంతెన నిర్మాణం పూర్తయితే పడవ ప్రయాణాలు పూర్తిగా తగ్గిపోతాయి.

మారనున్న రూపురేఖలు

వంతెన నిర్మాణంతో అచ్చంపేటకు ఉజ్వల భవిష్యత్ ఉంటుంది. పెద్దపెద్ద పట్టణాలకు రాకపోకలు సులభతరం అవుతాయి. నిరుపయోగంగా ఉన్న వేల ఎకరాల భూములలో పెద్దపెద్ద పరిశ్రమలు వచ్చే అవకాశం ఉంది. యువత ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా స్థానికంగానే ఉద్యోగావకాశాలు దొరుకుతాయి. చుట్టుపక్కల ఉన్న గ్రామాల విలీనంతో అచ్చంపేట పట్టణంగా రూపుదిద్దుకునే అవకాశం ఉంది.

రూ.60.50 కోట్లతో..

రెండు జిల్లాలను కలుపుతూ కృష్ణానదిపై నిర్మించబోయే వంతెనకు 13.35 ఎకరాల భూమిని అధికారులు సేకరించారు. పల్నాడు జిల్లా మాదిపాడు వైపు 4.45 ఎకరాలు, ఎన్టీఆర్ జిల్లా ముక్త్యాలవైపు 9 ఎకరాల భూమిని సేకరించారు. బ్రిడ్జి పొడవు 600 మీటర్లు కాగా, వెడల్పు 12 మీటర్లు. ముక్త్యాలవైపు కిలోమీటరు, మాదిపాడు వైపు అర కిలోమీటరు మేర రోడ్డు వేయనున్నారు. ఇందుకు మొత్తం రూ.60.50 కోట్లు నాబార్డు నిధులు మంజూరు చేయించారు. 14 పిల్లర్లతో వంతెన నిర్మాణం కానుంది.



వంతెన ప్లాన్

వారధితో ఊహించని అభివృద్ధి



శతాబ్దాల మాదిపాడు బ్రిడ్జి కల సీఎం జగనన్న వల్ల సాకారమవుతోంది. ఈ వంతెన వల్ల రాకపోకలు, వ్యాపార లావాదేవీలకు ఎంతో మేలు జరుగుతుంది. భూముల ధరలు పెరుగుతాయి. పులిచింతల జలాశయం వల్ల పుష్కలంగా నీరు, విస్తారమైన భూములు ఉండటంతో రోడ్డు కనెక్టివిటీ పెరిగి పారిశ్రామికంగా ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుంది. జగ్గయ్యపేట ప్రాంతంలోని ఫ్యాక్టరీల నుంచి చెన్నైకు దూరం బాగా తగ్గుతుంది.

– నంబూరు శంకరరావు, పెదకూరపాడు ఎమ్మెల్యే

వంతెనతో ఎంతో మేలు



నేను మాదిపాడులో కిరాణా వ్యాపారిని. నాకు కావలసిన సరుకు మొత్తం పడవలోనే జగ్గయ్యపేట వెళ్లి తెచ్చుకోవాలి. వరదలు వస్తే వారం పదిరోజుల వరకు పడవలు నడపరు. ఆ సమయంలో వ్యాపారం ఆపుకోవాల్సిందే. పడవలలో సరుకుతో ప్రయాణించడం కూడా చాలా కష్టంగా ఉంది. బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే మా ఇబ్బందులన్నీ తొలగిపోతాయి. వ్యాపారాలు పెరుగుతాయి.

– దేవరశెట్టి శ్రీనివాసరావు, వ్యాపారస్తుడు, మాదిపాడు

దూరాభారం తగ్గుతుంది



నాకు ఆరు ఎకరాల పొలం ఉంది. వ్యవసాయమే జీవనాధారం. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులతోపాటు ఏ చిన్న అవసరం వచ్చినా 30కి.మీ. దూరంలో ఉన్న అచ్చంపేటకు వెళ్లాల్సి వస్తోంది. చాలా యాతనగా ఉంది. బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే మా గ్రామానికి జగ్గయ్యపేట కేవలం 12 కిలోమీటర్లే ఉంటుంది. అక్కడ వైద్యంతోపాటు అన్ని సదుపాయాలూ ఉంటాయి.

– కంబాల ఏడుకొండలు, రైతు, మాదిపాడు

సుగంధ ద్రవ్యాల ఎగుమతులు పెరగాలి

పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి



స్పైసెస్ బోర్డు ప్రతినిధులు, సుగంధ సాగు రైతులు, ఎగుమతిదారులతో కలెక్టర్ శివశంకర్

యడ్లపాడు: రాష్ట్రం నుంచి సుగంధ ద్రవ్యాల ఎగుమతులు పెరగాలని, మానవ జాతికి మేలు చేసే ఆహార ఉత్పత్తుల సాగుపై రైతులు దృష్టి పెట్టాలని పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి చెప్పారు. మండలంలోని మైదవోలు–వంకాయలపాడు పరిధిలో ఉన్న స్పైసెస్ పార్కులో బుధవారం ప్రపంచ ఆరోగ్య భద్రత దినోత్సవం నిర్వహించారు. స్పైసెస్ బోర్డు డెప్యూటీ డైరెక్టర్ అనన్‌దేబర్మ ఆధ్వర్యంలో వ్యవస్థాపకత అభివృద్ధిపై ఒకరోజు శిక్షణ నిర్వహించారు. బోర్డు మార్కెటింగ్ డైరెక్టర్ బీఎన్ ఝా అధ్యక్షత వహించిన ఈ శిక్షణకు జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి హాజరై ప్రసంగించారు. భారతదేశంలో 2030 నాటికి పది బిలియన్ డాలర్ల ఎగుమతులు లక్ష్యం కాగా, ఇప్పటికీ 50 శాతం పూర్తయినట్లు కలెక్టర్ తెలిపారు. రానున్న ఏడేళ్లలో మిగిలిన 50శాతం పూర్తి చేసేలా లక్ష్యాన్ని నిర్ణయించినట్లు చెప్పారు. ఇందులో రెండు తెలుగు రాష్ట్రాల సుగంధ ద్రవ్యాల సాగు రైతులు భాగస్వాములు కావాలని ఆయన ఆకాంక్షించారు. ఆర్గానిక్ ఫార్మింగ్ క్లస్టర్ కూడా ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమని తెలిపారు. సేంద్రియ ఉత్పత్తులతో ఆరోగ్యకర సమాజం సాధ్యమవుతుందని, అందరూ ఈ దిశగా కృషి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా ఉద్యానశాఖ అధికారి బి.జె. బెన్నీ, చిలకలూరిపేట హెచ్‌వో కిశోర్‌కుమార్, తహసీల్దార్ ఎస్.నాగమల్లేశ్వరరావు, ఎంపీడీవో వై.హనుమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ట్రాఫిక్ వలయంలో చిక్కుకున్న ప్రయాణికులు

• వాన బీభత్సం

వినుకొండ టౌన్: పట్టణంలో బుధవారం సాయంత్రం వాన బీభత్సం సృష్టించింది. భారీ వృక్షాలు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. కరెంట్ సరఫరాకు అంతరాయం కలిగింది. రేకుల షెడ్లు, పూరి గుడిసెలు కూలాయి. ప్రధానంగా కారంపూడి రోడ్డులోని కళ్యాణపురి కాలనీ సమీపంలో దాదాపు 10 వరకు భారీ వృక్షాలు నేలకొరిగాయి. ఈ దారిలో ట్రాఫిక్ భారీగా నిలిచిపోయింది. దాదాపు 2 గంటల పాటు రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిచాయి.

నేలకొరిగిన వృక్షం



మేరా జగన్ మహాన్

థాంక్యూ సీఎం సార్

- రూ.9 కోట్ల విలువైన 20 సెంట్ల స్థలం మసీదుకు కేటాయింపు
- రాష్ట్ర మంత్రివర్గ తీర్మానం
- మంత్రి అంబటి చొరవతో సాకారం
- పట్టణ ముస్లింల హర్షం

సత్తెనపల్లి: గుంటూరు–మాచర్ల ప్రధాన రహదారిలో పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణ పరిధిలోని ఎస్‌ఎస్పీ కాలనీలో రూ. 9 కోట్ల విలువైన 20 సెంట్ల స్థలాన్ని మస్జిద్–ఈ–అఖ్సాకు కేటాయిస్తూ రాష్ట్ర మంత్రి మండలి బుధవారం తీర్మానం చేసింది. 25ఏళ్లుగా ఇక్కడ తాత్కాలిక షెడ్డులో నమాజ్ చేసుకుంటున్న ముస్లిం సోదరుల వినతి మేరకు రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ప్రత్యేక చొరవతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నిర్ణయం తీసుకున్నారు. దీంతో ముస్లింలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మేరా జగన్ మహాన్.. థాంక్యూ సీఎం సార్ అంటూ నినదిస్తున్నారు.



పట్టణంలో మస్జిద్–ఈ–అఖ్సాకు కేటాయించిన స్థలం

పులిచింతల ప్రాజెక్టు పరిధిలో పనిచేస్తున్న ముస్లిం ఉద్యోగులు సత్తెనపల్లి పట్టణంలో ఎస్‌ఎస్పీ కాలనీ వద్ద 20 సెంట్ల స్థలంలో 25ఏళ్ల క్రితం నెలకు రూ. 18 అద్దె ప్రాతిపదికన నమాజ్‌లు చేయడం ప్రారంభించారు. అనంతర కాలంలో తాత్కాలిక కట్టడం, ప్రహరీ ఉద్యోగులే వారి సొంత ఖర్చుతో నిర్మించుకున్నారు. మున్సిపాలిటీ నుంచి మంచినీటి వసతి లభించింది. రోజూ సుమారు రెండు వందల మంది నమాజ్‌లకు హాజరవుతుండగా శుక్రవారం, ఇతర పండుగ దినాలలో 500 నుంచి 600 మంది ఇక్కడ ప్రార్థనలు చేస్తారు.

మంత్రి అంబటి రాంబాబు కృషి

పులిచింతల ప్రాజెక్టు ఉద్యోగులతో పాటు స్థానికంగా ఉన్న ఇతర ఉద్యోగులూ ఈ మసీదుకు రావడంతో వారంతా కలిసి మస్జిద్–ఈ–అఖ్సా వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కమిటీగా ఏర్పడి ఈ స్థలాన్ని మసీదు కోసం కేటాయించాలని మంత్రి అంబటి రాంబాబుకు విన్నవించారు. దీంతో మంత్రి విషయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెనువెంటనే ఆయన గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఈ మేరకు బుధవారం మంత్రివర్గ సమావేశంలో తీర్మానం కూడా చేశారు. అయితే మసీదు కమిటీ వ్యక్తిగత భాగస్వామ్యంగా రూ.లక్ష ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుంది.

కట్టుకున్న భర్తే కాలయముడై..

- భార్య మెడ భాగంలో చేతులతో మోది హత్య
- ఆనక ఎలుకల మందు తిని ఆత్మహత్యయత్నం
- సత్తెనపల్లి రంగా కాలనీలో దారుణం
- అనుమానమే కారణం!
- పోలీసులకు లొంగిపోయిన నిందితుడు!



అరుణ



కార్తీక్ (ఫైల్ ఫొటోలు)

సత్తెనపల్లి: భార్యపై అనుమానంతో కోపం పెంచుకొని కట్టుకున్న భర్తే ఆమె మెడపై చేతులతో మోది హతమార్చిన ఘటన సత్తెనపల్లి పట్టణంలోని రంగా కాలనీ 11వ లైన్‌లో జరిగింది. సత్తెనపల్లి టౌన్ సీఐ యు.శోభన్ బాబు కథనం ప్రకారం.. పట్టణంలోని రంగాకాలనీ 11వ లైన్‌కు చెందిన వల్లపు అరుణ(18), సత్తెనపల్లి మండలం భీమవరం గ్రామానికి చెందిన ఒంటిపులి కార్తీక్ మూడేళ్ల క్రితం ప్రేమించుకుని పెళ్లి చేసుకున్నారు. ఎంతో అన్యోన్యంగా జీవించేవారు. వీరికి ఏడాదిన్నర వయస్సు కలిగిన కుమార్తె అఖిలాండేశ్వరి ఉంది. కార్తీక్ భవన నిర్మాణ కార్మికుడిగా పని చేస్తున్నాడు. కార్తీక్ స్థానికంగా పనులు లేనప్పుడు హైదరాబాద్ వెళ్లి నిర్మాణ రంగ పనుల్లో కొంత కాలం పని చేసి వచ్చి పోతుంటాడు. ఈ క్రమంలో భార్య అరుణ ప్రవర్తనపై అనుమానం పెంచుకున్నాడు. దీనిపై కొంతకాలంగా భార్యాభర్తలిద్దరూ గొడవ పడుతున్నారు. మంగళవారం రాత్రి 11 గంటల సమయంలోనూ ఇద్దరూ గొడవ పడ్డారు. అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో కార్తీక్ మద్యం తాగి వచ్చి భార్య అరుణతో వాదనకు దిగాడు. కోపోద్రిక్తుడై చేతులతో ఆమె మెడ భాగంలో బలవంతంగా మోదాడు. దీంతో అరుణ అక్కడికక్కడే పడిపోయి మరణించింది. భయాందోళనకు గురైన కార్తీక్ తాను కూడా చనిపోవాలని నిర్ణయించుకుని ఎలుకల మందు తిని ఆత్మహత్యకు యత్నించాడు. అనంతరం అతను ఆస్పత్రికి వెళ్లాడు. ప్రాణానికి ఎలాంటి అపాయం లేదని వైద్యులు చెప్పడంతో కొద్దిసేపటికి పట్టణ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి పోలీసుల ఎదుట లొంగిపోయినట్లు సమాచారం. ఘటనా స్థలాన్ని పట్టణ సీఐ యు.శోభన్‌బాబు, తహసీల్దార్ కె.నగేష్, సిబ్బంది సందర్శించి మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతురాలి తల్లి కోటేశ్వరమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



అరుణ మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ శోభన్‌బాబు

ఉద్యోగ ఉత్సాహం

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంత్రివర్గ నిర్ణయాలపై హర్షం

గుంటూరు మెడికల్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు సాగుతోంది. దీనిలో భాగంగా బుధవారం జరిగిన మంత్రివర్గ సమావేశం వరాల జల్లు కురిపించింది. కాంట్రాక్టు ఉద్యోగుల రెన్యూవల్‌తోపాటు నెలరోజుల ముందే పీఆర్సీ కమిటీ నియామకం, సీపీఎస్ రద్దు వంటి అంశాలపై నిర్ణయం తీసుకుంది. వీటిపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఉద్యోగవర్గాలు ఆనందంతో జై జగన్ అంటూ నినదిస్తున్నాయి. పలువురు ఉద్యోగుల మనోగతం ఇదీ..

సీపీఎస్ రద్దు భేష్



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నారు. సీపీఎస్ రద్దు చేసినందుకు ధన్యవాదాలు. జీపీఎస్ బిల్లు హర్షణీయం.

– ప్రేమజ్యోతిబాబు, వైఎస్సార్‌టీయూ జిల్లా అధ్యక్షుడు

స్వాగతిస్తున్నాం



సీపీఎస్‌ను రద్దు చేస్తూ జీపీఎస్‌ను ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నాం. ఓపీఎస్‌ను తిరిగి అమలు చేయటం ఏ ప్రభుత్వానికీ సాధ్యపడదు.

– కె.వి.సుబ్బారెడ్డి, ఉపాధ్యాయుడు, ఎస్టీయూ

హర్షణీయం



సీపీఎస్ రద్దు చేస్తూ రాష్ట్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయం హర్షణీయం. జీపీఎస్‌లో ఏముందో పరిశీలించాల్సి ఉంది. దీంతోపాటు పీఆర్సీ కమిటీ నియామకం, జిల్లా కేంద్రాలలో హెచ్‌ఆర్‌ఏ పెంపు వంటి నిర్ణయాలను స్వాగతిస్తున్నాం.

– కొండ్రు మోహనరావు, ఆప్టా రాష్ట్ర అధ్యక్షుడు

పీఆర్సీ కమిటీ నియామకం మేలు



మంత్రివర్గ నిర్ణయాలను స్వాగతిస్తున్నాం. డీఏ పెంపుతో ఉద్యోగులకు ఎంతో మేలు జరుగుతుంది. పీఆర్సీ కమిటీ నియామకం మేలే.

– ఓంకార్, రెవెన్యూ అసోసియేషన్ కోశాధికారి

ఉద్యోగుల పక్షపాతి సీఎం జగన్



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉద్యోగుల పక్షపాతి. ముఖ్యంగా నెల రోజులు ముందుగానే పీఆర్సీ కమిటీని నియమించడం గొప్ప విషయం. కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్ నిర్ణయం భేష్. ఇది ఉద్యోగ ప్రభుత్వం అనేందుకు ఈ అంశాలే నిదర్శనం. ఏపీ ఎన్జీఓ గుంటూరు జిల్లా శాఖ తరఫున ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

– ఘంటసాల శ్రీనివాసరావు, ఏపీ ఎన్జీఓ జిల్లా అధ్యక్షుడు

సీఎం వైఎస్ జగన్‌కు రుణపడి ఉంటాం



గత ప్రభుత్వాలు కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని ఎన్నో హామీలు ఇచ్చి మాట తప్పాయి. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి సంచలన నిర్ణయం తీసుకున్నారు. 10వేల మందికిపైగా కాంట్రాక్టు ఉద్యోగుల జీవితాలు మారిపోనున్నాయి. ముఖ్యమంత్రికి కాంట్రాక్టు ఉద్యోగులు జీవితాంతం రుణపడి ఉంటారు.

– సంతోష్ మాతృకుమార్, కాంట్రాక్టు పారామెడికల్ ఉద్యోగుల అసోసియేషన్ నాయకుడు

అంగరంగ వైభవంగా ఆలయాల నిర్మాణానికి శంకుస్థాపన

ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు



ఆలయ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు కాసు మహేష్‌రెడ్డి, పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

దాచేపల్లి: పల్నాటి తొలి మహిళా మంత్రి నాయకురాలు నాగమ్మ నిర్మించిన చెన్నమల్లికార్జునస్వామి ఆలయ పునరుద్ధరణ, శ్రీ రాజరాజేశ్వరిదేవీ సమేత శ్రీ మహారాజ రాజరాజేశ్వరిస్వామి దేవస్థానం శంకుస్థాపన మహోత్సవం బుధవారం భక్తిశ్రద్ధలతో జరిగింది. పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం గామాలపాడులో ఈ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో శ్రీ శైవక్షేత్ర పీఠాధిపతి శివస్వామి పర్యవేక్షణలో నిర్వహించారు. సుమారు రూ.100 కోట్లతో నిర్మించనున్న ఆలయాలకు శంకుస్థాపన చేశారు. శివస్వామి పర్యవేక్షణలో పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ దంపతులు శంకుస్థాపనలో పాల్గొని ప్రత్యేకంగా పూజలు చేశారు. తొలుత హోమం నిర్వహించారు. అనంతరం వేదమంత్రాలతో చెన్నమల్లికార్జునస్వామి దేవాలయం పునరుద్ధరణ, శ్రీ రాజరాజేశ్వరి స్వామి దేవస్థానంతో పాటు పలువురు దేవతమూర్తుల ఆలయాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఎంపీలు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యేలు కాసు మహేష్‌రెడ్డి, పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, నంబూరి శంకరరావు, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, మాజీ ఎమ్మెల్సీ టి.జి.వి.కృష్ణారెడ్డి, వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ దేవళ్ల రేవతి, మానవ హక్కుల కమిషన్ మాజీ చైర్మన్ కాకుమాను పెదపేరిరెడ్డి, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకటరామిరెడ్డి తదితరులు శంకుస్థాపనలో పాల్గొని పూజలు నిర్వహించారు.

కోటి రూపాయల నిధులు: కలెక్టర్

జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ మాట్లాడుతూ దేవాలయం నిర్మాణానికి ప్రభుత్వం నుంచి కోటి రూపాయలు కేటాయించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రూ.100 కోట్లతో 800 సంవత్సరాల చరిత్ర కలిగిన చెన్నమల్లికార్జునస్వామి దేవాలయాన్ని పునరుద్ధరించి శ్రీరాజరాజేశ్వరి స్వామి దేవాలయం నిర్మిస్తామని కమిటీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ జంగా చెప్పారు. నాలుగు దిక్కుల గాలి గోపురాలు ఉంటాయన్నారు. ప్రధాన గాలి గోపురం ఎత్తు 272 అడుగులు ఉంటుందని తెలిపారు. ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డితో పాటు ప్రజల సహాయ, సహకారాలతో దేవాలయాలు నిర్మిస్తామని చెప్పారు. ప్రతి ఒక్కరూ నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఎమ్మెల్సీ జంగా కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు జంగా వెంకట కోటయ్య, మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, సర్పంచ్ జంగా సురేష్, నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సుబ్బమ్మ, ఎంపీటీసీ సభ్యుడు షేక్ ఆదాంసాహెబ్, స్థపతి వెంకటరెడ్డి, దేవదాయశాఖ జిల్లా అధికారి సత్యనారాయణరెడ్డి, డివిజన్ ఇన్‌స్పెక్టర్ లీలావతి, ఈవో నెమలిరెడ్డి, కమిటీ సభ్యులు షేక్ షరీఫ్, అంబటి శేషగిరిరావు, భూషణం చెన్నయ్య, మాశెట్టి బుజ్జి పాల్గొన్నారు.



ప్రతిష్ఠలో జలబిందెలతో పూజలు చేస్తున్న కలెక్టర్ శివశంకర్, ఎమ్మెల్సీ జంగా దంపతులు

పల్నాటి ఘనకీర్తిని ప్రపంచానికి చాటి చెబుదాం

పల్నాటి ఘనకీర్తిని ప్రపంచానికి చాటిచెప్పుదామని గురజాల శాసనసభ్యుడు కాసు మహేష్‌రెడ్డి పిలుపునిచ్చారు. చెన్నమల్లికార్జునస్వామి, శ్రీ రాజరాజేశ్వరిస్వామి దేవాలయాల శంకుస్థాపన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే కాసు మాట్లాడారు. ప్రజాప్రతినిధులుగా తాము ఉన్న సమయంలో ఇటువంటి క్షేత్రం అభివృద్ధి చేయడం శుభపరిణామని పేర్కొన్నారు.

దేవాలయాల నిర్మాణానికి విరాళాలు

దాచేపల్లి: మండలంలోని గామాలపాడు గ్రామ పంచాయతీ పరిధిలో నిర్మించనున్న చెన్నమల్లికార్జునస్వామి, రాజరాజేశ్వరి దేవాలయాల నిర్మాణాలకు భక్తులు బుధవారం విరాళాలు ప్రకటించారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ, కమిటీ అధ్యక్షుడు జంగా కృష్ణమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ సతీమణి లక్ష్మి తన చేతికి ఉన్న బంగారం గాజును విరాళంగా అక్కడికక్కడే శివస్వామికి ఇచ్చారు. మాజీ ఎమ్మెల్సీ టీజీవీ కృష్ణారెడ్డి రూ.25లక్షలతో గోశాల నిర్మాణానికి విరాళం ప్రకటించారు. జిల్లా అభివృద్ధి అధికారిణి వై.మహాలక్ష్మి తన మెడలోని బంగారం గొలుసును విరాళంగా ఇచ్చారు. నడికుడికి చెందిన కొరిమెళ్ల సైదయ్య రూ.10లక్షలతో ధ్వజస్తంభం ఇస్తామని ప్రకటించారు. గుండా రాజేశ్వరరావు కుటుంబ సభ్యులు రూ.1,00,116, గుండా రామాంజనేయులు రూ1,00,116 అందజేశారు.

నిర్దిష్ట ప్రణాళికతో సీఎం సభకు ఏర్పాట్లు

సీఎం ప్రోగ్రామ్స్ కోఆర్డినేటర్ తలశిల రఘురామ్



క్రోసూరు మోడల్ స్కూల్ వద్ద సభాస్థలిని పరిశీలిస్తున్న సీఎం ప్రోగ్రామ్స్ కోఆర్డినేటర్ తలశిల రఘురామ్, ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, జిల్లా కలెక్టర్ శివశంకర్, జేసీ శ్యాంప్రసాద్ తదితరులు

క్రోసూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనకు నిర్దిష్ట ప్రణాళికతో ఏర్పాట్లు పూర్తి చేయాలని సీఎం ప్రోగ్రామ్స్ కోఆర్డినేటర్ తలశిల రఘురాం అధికారులను కోరారు. ఈనెల 12వ తేదీ జగనన్న విద్యాకానుకల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. బుధవారం క్రోసూరులో సీఎం బహిరంగ సభ జరిగే మోడల్ స్కూల్, పరిసరాలను ఎమ్మెల్యే నంబూరు శంకరరావుతో కలసి పరిశీలించారు. వీరి వెంట కలెక్టర్ ఎల్.శివశంకర్, ఎస్పీ రవిశంకర్, జాయింట్ కలెక్టర్ ఏ.శ్యాంప్రసాద్, వివిధ శాఖల అధికారులు పరిశీలించారు. అనంతరం జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు.

పకడ్బందీ బందోబస్తు: ఎస్పీ రవిశంకర్‌రెడ్డి

క్రోసూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 12న క్రోసూరు రానున్న దృష్ట్యా పకడ్బందీగా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు పల్నాడు జిల్లా ఎస్పీ రవిశంకర్ రెడ్డి తెలిపారు. భద్రతా ఏర్పాట్లపై స్థానిక కార్యాలయంలో బుధవారం సీఎం ప్రోగ్రామ్స్ కో ఆర్డినేటర్ తలశిల రఘురాంతో కలసి పోలీసు అధికారులతో భద్రతా ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. తొలుత క్రోసూరులోని పశువుల ఆస్పత్రి వద్ద ఉన్న పొలాల్లో హెలిప్యాడ్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించారు. సభా ప్రాంగణం, వీవీఐపీ, వీఐపీల రాకపోకలకు సంబంధించిన రహదారి మార్గాలపై ప్రజా ప్రతినిధులు, అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో ఎస్పీతో పాటుగా తలశిల రఘురాం, జాయింట్ కలెక్టర్ ఏ శ్యాంప్రసాద్, పల్నాడు జిల్లా అదనపు ఎస్పీ ఏ రామచంద్రరాజు, సత్తెనపల్లి డీఎస్పీ ఆదినారాయణ, ఏఆర్ డీఎస్పీ చిన్ని కృష్ణ ఉన్నారు.



పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎస్పీ రవిశంకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ తలశిల తదితరులు

కోటప్పకొండ ఆలయ ఈఓగా శ్రీనివాసరెడ్డి



శ్రీనివాసరెడ్డిని సత్కరిస్తున్న ఆలయ అర్చకులు

నరసరావుపేట ఈస్ట్: ప్రముఖ శైవక్షేత్రం కోటప్పకొండ శ్రీత్రికోటేశ్వరస్వామి ఆలయ కార్యనిర్వాహణాధికారిగా గొలమారి శ్రీనివాసరెడ్డి బుధవారం అదనపు బాధ్యతలు స్వీకరించారు. ప్రకాశం జిల్లా మార్కాపురంలోని శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయ ఈఓగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసరెడ్డికి కోటప్పకొండ ఈఓగా అదనపు బాధ్యతలను అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసరెడ్డిని ఆలయ అర్చకులు సత్కరించారు.

వైభవంగా రామాలయం ప్రతిష్ఠా మహోత్సవం

పూజలు చేసిన ఎమ్మెల్యే కాసు, ఎంపీ అయోధ్యరామిరెడ్డి



ప్రతిష్ఠించిన రామాలయంలో పూజలు చేస్తున్న దృశ్యం

దాచేపల్లి: నగర పంచాయతీ పరిధిలోని ఇరికేపల్లిలో నూతనంగా నిర్మించిన కోదండరామాలయ ప్రతిష్ఠా మహోత్సవం బుధవారం నిర్వహించారు. దైద అమరలింగేశ్వరస్వామి దేవస్థానం వేద పండితులు బ్రహ్మశ్రీ పిన్నెల్లి దుర్గాప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో ఈ ప్రతిష్ఠా మహోత్సవం భక్తిశ్రద్ధలతో చేశారు. గణపతి పూజతో ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆలయం ప్రాంగణంలో విఘ్నేశ్వర, ఆంజనేయ, ద్వారకపాలక, భక్తాంజనేయ సహిత విగ్రహాలు, జీవధ్వజం, కీర్తి ధ్వజం, ఆలయ శిఖర కలశలను కూడా ప్రతిష్ఠించారు. ఉత్సవాల్లో స్థానిక ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, ఎంపీ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. అన్నదానం చేశారు. పూజలు చేసిన వారిలో నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సుబ్బమ్మ సాంబయ్య, మాజీ సర్పంచులు బుర్రి విజయ్‌కుమార్‌రెడ్డి, మందపాటి రమేష్‌రెడ్డి, కౌన్సిలర్లు మందపాటి వీరారెడ్డి, ఈదా వెంకటరెడ్డి పాల్గొన్నారు.

భారత సంస్కృతిలో శ్రీరాముడు భాగం



విమాన శిఖర కలశ ప్రతిష్ఠలో త్రిదండి చినజీయర్ స్వామి, శ్రీనివాస దీక్షితులు



ప్రతిష్ఠా మహోత్సవానికితరలివచ్చిన భక్తులు

నాదెండ్ల: భారత సంస్కృతిలో శ్రీరాముడు భాగమని, దేశంలోని ప్రతి గ్రామంలో రామాలయం ఉండటం ఆయన విశిష్టతకు నిదర్శనమని త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామి అభిభాషించారు. గణపవరంలో రూ.2.5 కోట్లతో పూర్తి రాతితో నిర్మించిన రామాలయంలో శ్రీ సీతా లక్ష్మణ హనుమత్ సమేత కోదండరామస్వామి విగ్రహాల ప్రతిష్ఠను బుధవారం ఆయన చేతుల మీదుగా నిర్వహించారు. శిఖర కలశాలతో పాటు జీవ ధ్వజ స్తంభాన్ని ప్రతిష్ఠింప చేశారు. చినజీయర్ స్వామి రాకతో గ్రామంలో భక్తి వాతావరణం పెల్లుబికింది. కమిటీ సభ్యులు, వేదపండితులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ముందుగా జీవ ధ్వజ స్తంభం వద్ద యంత్ర స్థాపన నిర్వహించి, అనంతరం ఆలయంపై శిఖర కలశాలను ప్రతిష్ఠించారు. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించిన కమిటీ సభ్యులు, గ్రామస్తుల్ని అభినందించారు. ఆలయ స్థపతి పమిడాకుల రాజేశ్వరాచారి కళా నైపుణ్యాన్ని ప్రశంసించారు. ఆయనకు స్వర్ణ కంకణధారణ చేసి నూతన వస్త్రాలు, శాలువతో సత్కరించారు. ధ్వజ స్తంభాన్ని, ద్వారబంధాలను తయారు చేసి సిద్ధు లోకేశ్వరరావును శాలువాలతో సత్కరించారు. యాగశాలలో ప్రత్యేకంగా చండీ హోమం, ప్రత్యేక పూజలు జరిపారు. టీటీడీ వేద పాఠశాల అధ్యాపకులు మాల్యవంతం శ్రీనివాసదీక్షితులు బృందం ఆధ్వర్యంలో 11.30 గంటలకు ధృవ కల్యాణం (ప్రతిష్ఠ) కన్నుల పండువగా నిర్వహించారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో సుమారు 50 వేల మందికి భారీ అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో చినజీయర్ స్వామి శిష్యుడు గుదిమెళ్ల కూర్మనాథస్వామి, ధనలక్ష్మి గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ డైరెక్టర్ పేర్ని వీరనారాయణ, కేతినేని శ్రీహరిరావు, భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ కన్వీనర్ బి.సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రముఖుల సందర్శన

రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు, ఏపీ స్టేట్ స్పిన్నింగ్ మిల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు లంకా రఘురామిరెడ్డి, శివస్వాతి స్పిన్నింగ్ మిల్లు డైరెక్టర్ అంకమ్మరావుపాల్గొన్నారు.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు సిగ్నలింగ్ వ్యవస్థ దోహదం

- జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి
- మల్లమ్మసెంటర్‌లో సిగ్నల్స్‌ను ప్రారంభించిన జిల్లా ఎస్పీ, ఎమ్మెల్యే



ట్రాఫిక్ సిగ్నల్స్ ఐలాండ్‌ను ప్రారంభిస్తున్న జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి, ఎమ్మెల్యే గోపిరెడ్డి

నరసరావుపేట: జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు సిగ్నలింగ్ వ్యవస్థ ఎంతో ఉపయోగంగా ఉంటుందని జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి తెలిపారు. మల్లమ్మసెంటర్‌లో ఏర్పాటు చేసిన నూతన సిగ్నల్స్ ఐలాండ్, సిగ్నల్ లైట్లను ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డితో కలసి ప్రారంభించారు. ఎస్పీ మాట్లాడుతూ ట్రాఫిక్ ఇబ్బందులను తొలగించేందుకు సిగ్నలింగ్ వ్యవస్థ ఏర్పాటుకు ఎమ్మెల్యే గోపిరెడ్డి పూర్తి బాధ్యతలు స్వీకరించారన్నారు. ఒక ఏజెన్సీని ఏర్పాటు చేయటం ద్వారా ఎనిమిది సెంటర్లలో సిగ్నల్స్, నాలుగు సెంటర్లలో బ్లికింగ్ లైట్లను ఏర్పాటు చేయించారని చెప్పారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ జిల్లా కేంద్రమైన తర్వాత ట్రాఫిక్ సమస్య పెరిగిందన్నారు. ప్రైవేటు సంస్థ సహకారంతో సుమారు రూ.3కోట్లు ఖర్చు చేసినట్లు వివరించారు. రోడ్లపై బండ్లు పెట్టి వ్యాపారాలు చేయటం లాంటివి మానుకోవాలన్నారు. షాపుల ముందున్న ఆక్రమణలను కూడా త్వరలో తొలగిస్తామని వీటికి వ్యాపారులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో డీఎస్పీ కేవీ మహేష్, వన్‌టౌన్ సీఐ అశోక్‌కుమార్, బులియన్ మర్చంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్, మున్సిపల్ ఎంపీ కె.శ్రీనివాసరావు, డీఈ ఓ.శ్రీనివాసరావు, ఎస్సీ సెల్ మానిటరింగ్ జిల్లా కమిటీ సభ్యుడు మల్లెల అశోక్, లైసెన్స్ ఇంజినీర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కొమ్మసాని కమలాకరరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు కందుల ఎజ్రా, వి.సాంబశివరావు, అచ్చి శివకోటి, షేక్ కరిముల్లా, పంగులూరి విజయకుమార్ పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండండి.. ఆందోళన వద్దు

గురజాల: చిరుత పులి పిల్ల ఉందని వస్తున్న వార్తలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎవరూ కూడా ఆందోళన చెందవద్దని పల్నాడు జిల్లా ఫారెస్టు అధికారి రామచంద్రరావు పేర్కొన్నారు. చిరుత పులి తిరుగుతున్న ప్రదేశాన్ని బుధవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గురజాలలోని జియో సెల్ టవర్ సమీపంలో చిరుత పులి సంచరిస్తున్నట్లు సీసీ ఫుటేజీ ద్వారా టవర్ నిర్వాహకులు గమనించి ఫిర్యాదు చేశారని చెప్పారు. మంగళవారం పరిశీలించగా చిరుత పులి కాలి వేలి ముద్రలు ఉన్నట్లు గుర్తించినట్లు వివరించారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి దాని కదలికలను పరిశీలించే పనిలో ఉన్నట్లు తెలిపారు. రాత్రి సీసీ కెమెరాల్లో చిరుత పులికి సంబంధించి ఎటువంటి కదలికలు రికార్డులు కాలేదన్నారు. ఒక వారం రోజుల పాటు నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. ఈ ప్రాంతంలో ఎక్కువగా పెద్ద ముళ్ల పొదలు ఉన్నాయని వాటిని ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకుంటే బాగుంటుందని చెప్పారు. రాత్రి పూట ప్రజలు ఎవరూ ఒంటరిగా ఈ ప్రాంతంలోకి రావద్దన్నారు. జిల్లా ఫారెస్టు అధికారితో పాటు నగర పంచాయతీ కమిషనర్ మోహన్ శ్రీనివాస్ , 12వ వార్డు కౌన్సిలర్ మహంకాళి అంకమ్మ నీలంరాజు, 10వ వార్డు కౌన్సిలర్ బొల్లయ్య ఉన్నారు.

షూటింగ్‌లో ముఖేష్‌కు కాంస్యం

గుంటూరు వెస్ట్ (క్రీడలు): నేషనల్ రైఫిల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భోపాల్‌లో జరుగుతున్న కుమార్ సురేంద్ర సింగ్ మెమోరియల్ నేషనల్ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో గుంటూరుకు చెందిన నేలవల్లి ముఖేష్ కాంస్య పతకం సాధించాడని ఇండియన్ అకాడమీ ఆఫ్ షూటింగ్ స్పోర్ట్స్ చీఫ్ కోచ్ ఎస్. సుబ్రమణ్యం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 25 మీటర్ల స్పోర్ట్స్ పిస్టల్ విభాగంలో 600 పాయింట్లకు గానూ 576 సాధించాడు. ప్రథమ, ద్వితీయ స్థానాలను తమిళనాడుకు చెందిన హర్‌సిమార్ సింగ్, ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఇషాన్ ఖాన్ కైవసం చేసుకున్నారు. ముఖేష్ ఇప్పటికే జాతీయ పోటీల్లో పతకాలు సాధించాడు. భారత శిక్షణ బృందంలో సభ్యునిగానూ ఉన్నాడు.

కుష్ఠువ్యాధిపై ప్రజలను అప్రమత్తం చేయండి

జిల్లా కలెక్టర్ శివశంకర్

నరసరావుపేట: జిల్లాలో కుష్ఠువ్యాధి కేసులు ఎక్కడైతే ఎక్కువగా నమోదవుతున్నాయో అక్కడ సర్వే చేసి ప్రజలను అప్రమత్తం చేయాలని జిల్లా వైద్యాధికారులను కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లో ఈనెల 26వ తేదీ నుంచి జూలై 16వ తేదీ వరకు నిర్వహించే కుష్ఠువ్యాధిగ్రస్తుల గుర్తింపు కార్యక్రమంపై కమిటీ సభ్యులతో చర్చించారు. లెప్రసీ కేసులు, చికిత్స విధానం గురించి తెలుసుకున్నారు. జిల్లా లెప్రసీ, టీబీ వ్యాధి నివారణ అధికారి డాక్టర్ కె.పద్మావతి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా జిల్లాలోని పరిస్థితిని వివరించారు. వ్యాధి గ్రస్తుల గురింపులో సచివాలయానికి ఓ కో ఆర్డినేటర్లు, వలంటీర్లు, ఆశ కార్యకర్తలతో కలిసి పనిచేయాలన్నారు. ఈసందర్భంగా వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య విభాగం అధికారి డాక్టర్ జి.శోభారాణి, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ గీతాంజలి, మాతా శిశుసంరక్షణ అధికారి డాక్టర్ నాగపద్మజ పాల్గొన్నారు.